క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బసవజయంతి


పూజలందుకుంటున్న బసవేశ్వరుడు

మద్దికెర: మండల కేంద్రంలోని బసవేశ్వర ఆలయంలో శుక్రవారం బసవ జయంతి సందర్భంగా మూలవిరాట్‌ను ప్రత్యేంకగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఆలయ ఆవరణలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తాలూరి వెంకటేశ్వరరెడ్డి దంపతులు అన్నదానం చేశారు.

ఇండియా కూటమి అభ్యర్థి ప్రచారం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో శుక్రవారం ఇండియా కూటమి అభ్యర్థి సీపీఐ రామచంద్రయ్య ప్రచారం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల, ప్రజా సంఘాల గాయకులతో ఓటను అభ్యర్థించారు. సమస్యల పరిష్కారానికి పోరాడే తనకు అవకాశమివ్వాలని కోరారు. ఎంపీ అభ్యర్థి కాంగ్రెస్ రాంపుల్లయ్య యాదవ్‌కు, తనకు రెండు ఓట్లు వేయాలని కోరారు.

అద్దెలు సక్రమంగా చెల్లించండి

పత్తికొండ రూరల్/ఆలూరు: స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్న దుకాణాల అద్దెలు సక్రమంగా చెల్లించకపోతే తాళం వేస్తామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడల అభివృద్ధి అధికారి జి.భూపతి రావు దుకాణదారులను హెచ్చరించారు. శుక్రవారం పత్తికొండలోని ఇండోర్ స్టేడియం పరిధిలో ఉన్న దుకాణాలను, ఆలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్న కాంప్లెక్స్‌లను తనిఖీ చేసి అద్దెలు పెండింగ్‌లో ఉన్న వారికి నోటీసులు అందించారు. బకాయిలు త్వరగా చెల్లించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా స్టేడియం అధికారుల బృందం, స్థానిక ఇండోర్ స్టేడియం సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తుగ్గలి: మండల పరిధిలోని రామాపురం, ఎల్లమ్మగుట్ట తండాలో చేపట్టిన డగ్‌అవుట్ ఫాం పాండ్ పనులను శుక్రవారం ఏపీడీ పక్కీరప్ప పరిశీలించారు. పని ప్రదేశంలో మస్టర్లను తనిఖీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని, కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీడీ సూచించారు. కొలతల ప్రకారం పని చేస్తే ప్రతిరోజూ కూలీలకు రూ.300లకు తగ్గకుండా వస్తుందన్నారు. గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఏపీడీ వెంట టీఏలు వెంకప్ప, జయరాముడు, ఫీల్డ్‌అసిస్టెంట్లు బద్రి, రమేష్ ఉన్నారు.

నేడు జొన్నగిరిలో శ్రీదేవి రోడ్‌షో

తుగ్గలి: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి శనివారం మధ్యాహ్నం జొన్నగిరిలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ, సచివాలయ మండల అధ్యక్షులు జిట్టా నాగేష్ యాదవ్, హనుమంతు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి రోడ్ షోను విజయవంతం చేయాలని వారు కోరారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రంలో శనివారం ఉదయం వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి రోడ్‌షో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి పాతబస్టాండు వరకు సాగే రోడ్‌షోకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

ముగిసిన శరణ బసవేశ్వర పురాణం

హొళగుంద: స్థానిక సిద్దేశ్వరస్వామి ఆవరణంలో జరుగుతున్న కలబుర్గి శరణ బసవేశ్వర స్వామి మహా పురాణ ప్రవచనం శుక్రవారం ముగిసింది. ప్రవచనకారుడు రాష్ట్రీయ పురస్కార గ్రహీత సిద్దరామయ్యస్వామి హిరేమఠ శాస్త్రీ భక్తులకు నెల రోజుల పాటు కలబుర్గి శరణ బసవేశ్వరస్వామి జీవిత చరిత్రను విడమరిచి చెప్పారు. అనంతరం ప్రవచనకారుడు భక్తులనుద్దేశించి మాట్లాడారు. దాన ధర్మాలు, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం వల్ల ఎంతో పుణ్యాన్ని పొందుతారని, ఆ మార్గంలో నడవాలని భక్తులకు సూచించారు. ఆలయ వంశ పారాంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్, సిద్దేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

మాచాపురంలో వైద్యశిబిరం

దేవనకొండ: మండలంలోని మాచాపురం గ్రామంలో శుక్రవారం తెర్నేకల్లు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు అరుణజ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యుల సలహాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, రంగస్వామి, సాయిబాబా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడం బాబు నైజం


రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కంగాటి శ్రీదేవి


రోడ్ షోకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

- రోడ్‌షోలో వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి
- భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

మద్దికెర: ప్రజలను మోసగించడమే టీడీపీ అధినేత చంద్రబాబు నైజమని, వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మద్దికెరలో రోడ్ షో నిర్వహించారు. – భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల మధ్య ప్రధాన బజారులో ఆమె ప్రసంగించారు. 600 హామీలు ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ తర్వాత ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ మరోసారి మోసం చేయడానికి వస్తున్నాడన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా నెరవేర్చే ముఖ్యంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలో, అపద్ధాలతో మోసం చేసే చంద్రబాబు కావాలో ఆలోచించి ఓటేయాలని కోరారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ఇళ్ల వద్దకే అందాలంటే ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, విజయుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, సొసైటీ అధ్యక్షులు శాంతన్న, సుబ్బయ్య, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, సీతారామిరెడ్డి, దేవాలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశులు, మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, ఎంపీటీసీలు రామకృష్ణ, ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు, నాగేష్, కృష్ణ, రామలింగారెడ్డి, భద్రయ్య, రామాంజులు, భరత్‌రెడ్డి, వివప్ప, నాగభూషణం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపును ఎవరూ ఆపలేరు

పత్తికొండ రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ చేసిన మంచే మళ్లీ గెలిపిస్తుందని, కుట్రలు, కుయుక్తులతో పేద ప్రజలందరి గెలుపును ఎవరూ ఆపలేరని వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం పత్తికొండలో నిర్వహించిన రోడ్ షోకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు రోడ్ షో సాగింది. గుత్తిరోడ్డు కూడలిలో ప్రజలనుద్దేశించి శ్రీదేవి ప్రసంగించారు. గడచిన ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో నవరత్నాల పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. పేద విద్యార్థుల తలరాతలు మార్చేందుకు మనబడి నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చి విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లు, వలంటీర్ వ్యవస్థ, పేదలకు ఇంటి స్థలాలు, పక్కా గృహాల నిర్మాణం తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే అందించడంతో పాటు ప్రతి గ్రామంలో అభివృద్ధి చేసి చూపించామన్నారు. ప్రజాసేవకులుగా గడచిన ఐదేళ్లలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల ముందుకొచ్చి ఓట్లడిగే టీడీపీ నాయకులు కావాలో, కష్టాల్లో తోడుగా నిలిచే జగనన్న కావాలో ప్రజలే తేల్చుకోవాలని కోరారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఈనెల 13న రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్‌చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సీనియర్ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ నారాయణదాస్, సర్పంచు కొమ్ము దీపిక, మాజీ వైస్ ఎంపీపీ పల్లె ప్రతాప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్‌షోకు తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

భారీ మెజారిటీతో గెలిపించాలి


ఓటు వేయాలని కోరుతున్న రామ్మోహన్ రెడ్డి, రాజేశ్వరి

వెల్దుర్తి(కృష్ణగిరి): వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యలను భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తన స్వగ్రామం చెరుకులపాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, వైస్ ఎంపీపీ రాజేశ్వరితో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి పార్టీ మేనిఫెస్టో ప్రతులను అందిస్తూ, మోడల్ బ్యాలెట్ ద్వారా ఫ్యాన్ గుర్తుకు ఓటెలా వేయాలో వివరించారు. మరోసారి సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవిను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండేందుకు వైఎస్సార్‌సీపీకి మళ్లీ పట్టం కట్టాలని అభ్యర్థించారు. అపర్ణ, శివమాధవులు పాల్గొన్నారు.

కృష్ణగిరి మండలంలో..

కృష్ణగిరి: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. మోడల్ బ్యాలెట్ ద్వారా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసే విధానాన్ని వివరించారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ ఆర్బీ వెంకట్రాముడు, ఆయా గ్రామాల నాయకులు లక్కసాగరం రాముడు, బాల ఈశ్వరయ్య, లక్ష్మీకాంతరెడ్డి, భీమిరెడ్డి, ప్రహ్లాద, నాగరాజు, మాధవరావు, నవీనపాటి, పోతురెడ్డి, సుంకిరెడ్డి, శంకరయ్య, గోవిందరాజులు, కృష్ణమూర్తి, నాగరాజు, రాజు, జయరాం రెడ్డి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.


ఎరుకులచెరువులో మోడల్ బ్యాలెట్ గురించి వివరిస్తున్న నాయకులు

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి


ప్రచార రథంపై నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బి.విరూపాక్షి, పక్కన పార్టీ జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ తెర్నేకల్లు సురేంద్రరెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బి.విరూపాక్షి

దేవనకొండ: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బి.విరూపాక్షి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన పార్టీ జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ తెర్నేకల్లు సురేంద్రరెడ్డితో కలిసి తెర్నేకల్లులో రోడ్డుషో నిర్వహించారు. ప్రచార రథంపై నుంచి విరూపాక్షి మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నదేనన్నారు. ఇచ్చిన మాట కోసం కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత కూడా జగనన్నేనన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఈనెల 13న రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకే వేసి ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెర్నేకల్లు సర్పంచ్ అరుణ్ కుమార్, పార్టీ నాయకులు రాజన్న, దివాకర్‌నాయుడు, చాప ఈరన్న, సత్యరాజు, వెంకటరామిరెడ్డి, ఉమాంబ, నామాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

● వైఎస్సార్‌సీపీలో చేరిక

తెర్నేకల్లు గ్రామానికి చెందిన 30 కుటుబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి పార్టీ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ తెర్నెకల్ సురేంద్రరెడ్డి, పార్టీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న పాలన నచ్చి పార్టీలో చేరుతున్నామని, విరూపాక్షి విజయం కోసం కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు.


పార్టీలోకి చేరిన వారితో రామసుబ్బారెడ్డి, విరూపాక్షి, సురేంద్రరెడ్డి

● విరూపాక్షికి మద్దతుగా..


ఖాజీపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


ఖాజీపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న వైకుంఠం మల్లికార్జున చౌదరి

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరూపాక్షికి మద్దతుగా పార్టీ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, జూటూరు మారయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఖాజీపురం, కొట్టాల తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి విరూపాక్షిని గెలిపించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు. బ్యాలెట్ నమూనాపై ప్రజలకు అవగాహన కల్పించారు.

● విస్తృత ప్రచారం

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, తంగరడోణ, బైలుపత్తికొండ, తొగలుగల్లు, యాటకల్లు, ముత్తుకూరు, డి.కోటకొండ, కారుమంచి, ములుగుందం, నగరూరు, జొహరాపురం, బిల్లేకల్లు, చిగిళి గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా బుసినె విరూపాక్షిని గెలిపిలించాలని కోరారు.

● కమ్మరచేడు గ్రామంలో ..

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సౌమ్యా రెడ్డి, సర్పంచ్ సునితారెడ్డి, హరిపుష్పావతమ్మ, మల్లికార్జునరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకుందామన్నారు. అందుకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా బుసినే విరూపాక్షిని గెలిపించుకోవాలన్నారు.


సౌమ్యా రెడ్డిని సన్మానంచిన గామస్తులు

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


బహుమతులు అందజేస్తున్న రామిరెడ్డి

హాలహర్వి: గెలుపోటములు సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి సూచించారు. మండంలోని నిట్రవట్టి గ్రామంలో మౌనేశ్వరస్వామి జాతర సందర్భంగా శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ న్విహించారు. విజేతలకు ఆయన నగదు బహుమతులు అంజేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా పోటీల్లో యువత చురుగ్గా పాల్గొని సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, మాజీ ఎంపీటీసీ తిమ్మప్ప, చింతకుంట సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు ఉలికోటి గాదిలింగప్ప, పరశురామ్, ఉలికోటి లింగప్ప, వడ్డే గాదిలింగప్ప, బసవరాజ్‌స్వామి, గంగాధర, జయరాం, మహాదేవ, వడ్డే యల్లలింగ పాల్గొన్నారు.

ఆశీర్వాదం


వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరూపాక్షిని ఓ అఘోరా ఆశీర్వదించారు. కాశీ నుంచి శుక్రవారం చిప్పగిరికి వచ్చిన అఘోరాను చూసేందుకు, ఫొటోలు దిగేందుకు ప్రజలు ఎగబడ్డారు. సాధువులతో కలిసి అఘోరా విరూపాక్షి స్వగృహానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. –చిప్పగిరి

టీడీపీ వస్తే విధ్వంసమే

- గుప్త నిధుల కోసం నెలల తరబడి పురాతన కోటలో తవ్వకాలు
- ఆలయాలు, కోటలు కూల్చిన చరిత్ర టీడీపీది



గుప్త నిధుల కోసం చెన్నంపల్లి కోటలో తవ్వకాలు జరుపుతున్న దృశ్యాలు (ఫైల్)

తుగ్గలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో నిత్యం పేదల గురించి ఆలోచించి ఇంటికే సంక్షేమ పథకాలు అందించారు. చంద్రబాబు మాత్రం నిత్యం వైఎస్ జగన్ ప్రభుత్వంపై విషం చిమ్ముతూ ఓట్ల కోసం దాన్ని పతాకస్థాయికి తీసుకెళ్లి విధ్వంసక పాలన అంటూ గగ్గోలు పెడుతుండడం హాస్యాస్పదం. అధికారంలో ఉన్నన్నాళ్లు ప్రజలను పట్టించుకోని బాబు ఏపీ లెక్క చేయకుండా అంతా విధ్వంసం సృష్టించారు. ఏకంగా సీఎంఓ కార్యాలయం నుంచే ఆదేశాలిచ్చి గుప్త నిధుల కోసం పురాతన కోటను ధ్వంసం చేశారు. అధికారం కోసం బాబు చేస్తున్న రాద్ధాంతంపై ప్రజలు చీదరించు కుంటున్నారు. ఒక్కసారి తన పాలన ఎలా సాగిందో తిరిగి చూసుకుంటే మంచిదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

టీడీపీ హయాంలో..

గత టీడీపీ హయాంలో తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న పురాతన కోటలో నెలల తరబడి తవ్వకాలు చేసి ధ్వంసం చేశారు. నియోజకవర్గానికి అప్పటి ఎమ్మెల్యే అయిన డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కూడా తవ్వకాలను అడ్డుకోలేదు. ప్రభుత్వ ఆదేశాలతో అప్పటి ఆర్డీఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మైనింగ్ ఏడీ స్థాయి అధికారులు దగ్గరుండి మరీ తవ్వకాలు జరిపించారు. 2017 డిసెంబర్ 13న ప్రారంభమైన తవ్వకాలు 2018 మేనెలాఖరు వరకు జరిపారు. కోటలో విశేషంగా బంగారం ఉందని ఓ స్వామీజీ చెప్పారని ప్రభుత్వమే ఏకంగా గుప్త నిధుల తవ్వకాలు జరిపించడం అప్పట్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దల సాయంతో పోలీసు బందోబస్తు మధ్య అధికారులు అక్కడే తిష్ట వేసి తవ్వకాలు చేయించడం గమనార్హం. జీఎస్ఐ అధికారులతో అత్యాధునిక పరికరాలతో సైతం సర్వే చేయించారు. స్వామీజీలు, పురోహితులతో ఎన్నో పూజలు చేయించారు. చివరకు కోటలో తాంత్రిక పూజలకు సైతం ఒడిగట్టారు. చెన్నంపల్లి గ్రామస్తులు ఎంతో భక్తితో కొలిచే శవాసప్ప దర్గా కోట సమీపంలోనే తవ్వకాలు జరిపారు. కోటపై ఉన్న బురుజులు సైతం పెకిలించారు. ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు జరిపి విధ్వంసం సృష్టించి గుప్త నిధులు భారీగా కొల్లగొట్టారనే ఆరోపణలు అప్పట్లో వినిపించారు. చివరకు తవ్వకాల్లో ఓ సీతారాముల విగ్రహం మాత్రమే బయటపడిందని దాన్ని ట్రెజరీకి అప్పగించారు. ఇవన్నీ మరిచి ఇప్పుడు టీడీపీ అధినేత చంద్ర బాబు విధ్వంసక పాలన అంటూ జపిస్తుండడంతో జనం మండి పడుతున్నారు. కోటలో తవ్వకాలు జరిపి భారీగా గుప్త నిధులు కాజేశారన్న అనుమానాలు ప్రజల్లో ఇప్పటికీ ఉన్నాయి. ఇవన్నీ మరిచి ఇప్పుడు గెలిస్తే ప్రజలకు అవి, ఇవి చేస్తామంటే జనం నవ్వుకుంటున్నారు.


గుప్త నిధుల కోసం చెన్నంపల్లి కోటలో పూజలు చేయిస్తున్న అధికారులు(ఫైల్)


గుప్త నిధుల కోసం చెన్నంపల్లి కోటలో తాంత్రిక పూజలు చేయిస్తున్న దృశ్యం(ఫైల్)

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం


భక్తజన సందోహం మధ్య కదులుతున్న రథోత్సవం

పత్తికొండ రూరల్: స్థానిక బ్రాహ్మణవీధిలో కొలువైన పురాతన లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అమరావతి శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో భక్తాదుల నడుమ మంగళవాయిద్యాలు, మేళతాళాలతో అర్చకులు సత్యనారాయణస్వామి కల్యాణాన్ని జరిపించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించారు. పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఎంఎస్.భారతి హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు. గుత్తిరోడ్డు కూడలి నుంచి ఊరువాకిలి వరకు రథోత్సవం కొనసాగింది. గొరవయ్యల సంప్రదాయ నృత్యాలు, విచిత్ర వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ మురళీమోహన్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

రమణీయం.. రథోత్సవం

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో శుక్రవారం మునేశ్వరస్వామి రథోత్సవం కడు రమణీయంగా సాగింది. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మునేశ్వరస్వామి రథాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో ముందుకు లాగారు. ఆంధ్ర నుంచే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మునేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొని రథానికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం


పూజలందుకున్న మునేశ్వరస్వామి

● మల్లన్న సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి

ఆత్మకూరు : భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను శుక్రవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి బసవరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు వారికి ఆశీర్వచనాలు పలుకగా, దేవస్థానం తరఫున అధికారులు స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.